క్లుప్తంగా

సంతకాల సేకరణ విజయవంతం చేయాలి


పేరాడ తిలక్

టెక్కలి: మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టే విధంగా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలతో పాటు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. టెక్కలి నియోజకవర్గంలో సంతకాల సేకరణ విజయవంతం చేయాలన్నారు. మొదటగా కోటబొమ్మాళి మండలం పెద్దబమ్మిడి, చిన్నబమ్మిడి, ఎత్తురాళ్లపాడు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి అవగాహన కార్యక్రమాలు, సంతకాల సేకరణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రతీ మండలంలో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

అధ్యక్షుడిగా రమణబాబు


నూతన కార్యవర్గం సభ్యులు

నందిగాం: మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా కోరాడ రమణబాబు ఎన్నికయ్యారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో కుమార్ పట్నాయక్, డిప్యూటీ ఎంపీడీవో సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా రమణబాబు, ఉపాధ్యక్షుడిగా కంచరాన గోపీనాథ్, గౌరవ అధ్యక్షుడిగా కొర్రాయి కృష్ణారావు, జనరల్ సెక్రటరీగా పాగోటి విశ్వేశ్వరరావు, ట్రెజరర్‌గా బసవకుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జానకి, జాయింట సెక్రటరీగా డి.గౌతమి, మెంబర్లుగా రాహుల్‌రాయ్, హేమసుందర్, వర్ధన్, సంతోష్, దిలీప్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు


ఇచ్ఛాపురం రూరల్: గ్రామ, వార్డు సచివాలయాల మండల జేఏసీ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గురువారం లొద్దపుట్టి ధనరాజుల తులసమ్మ ఆలయం వద్ద సచివాలయ ఉద్యోగులు నూతన జేఏసీగా కార్యవర్గం ఏర్పాటైంది. చైర్మన్‌గా పొల్లాయి అశోక్, ప్రధాన కార్యదర్శిగా బి.మనోజ్, కన్వీనర్‌గా పి.తారకేసు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సల్ల ప్రవీణ్, వైస్ చైర్మన్లుగా జోగమ్మ, మల్లేష్, కోశాధికారులుగా బాలకృష్ణ, కుర్మాన నీరజ, పబ్లిసిటీ కార్యదర్శిగా చిన్నారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డి.చిరంజీవి, శారద, పాడి, కవిత, సంతోష్, జయమ్మ, గోపాలరావు, నవీన్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. దీంతో వీరిని పలువురు అభినందించారు.

నిరంతర పర్యవేక్షణ అవసరం


వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సోంపేట: ఖరీఫ్ వరి సాగులో రానున్న నెల రోజులు చీడపీడల నివారణలో నిరంతరం పర్యవేక్షణ అవసరమని మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి తెలియజేశారు. మండలంలోని పాలవలస గ్రామంలో వరి పంటను గురువారం పరిశీలించారు. రసం పీల్చే పురుగులు, సుడి దోమ, ఆకుపచ్చ దోమ ఉనికిని కనుగొనేందుకు పసుపు రంగు జిగురు అట్టలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఆయనతో పాటు వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కంచిలి: రహదారి భద్రత అందరి బాధ్యత అని ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది సూచిస్తున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి రహదారి భద్రత పక్షోత్సవాల్లో భాగంగా కంచిలిలో అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌పీవో జి.ప్రవీణ్‌కుమార్, సహాయకుడు వి.హేమంత్‌కుమార్, డ్రైవర్ పి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నాడు అభివృద్ధిలో ఘనం

నేడు పారిశుద్ధ్యం శూన్యం

- అధ్వానంగా మండపల్లి పంచాయతీ
- చెక్ పవర్ రద్దుతో నిలిచిన పాలన

ఇచ్ఛాపురం రూరల్:

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అత్యంత అభివృద్ధి చెందిన పంచాయతీ ఏదని అంటే వెంటనే అధికారులు చెప్పేపేరు మండపల్లి. గత వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, జగనన్న పాలవెల్లువ, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ సెంటర్, సామాజిక భవనాలు, నూతన అంగన్‌వాడీ కేంద్రం, నాడు–నేడు నిధులతో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి, ప్రతీ వీధికి సీసీ రోడ్డుతో మండపల్లి ప్రగతి పథంలో పయనించింది. అయితే సార్వత్రిక ఎన్నికల అనంతరం గ్రామాభివృద్ధి కుంటుపడింది. స్థానిక సర్పంచ్ పిట్ట శేషమ్మ నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగంతో ఈ ఏడాది ఫిబ్రవరి 13న ప్రభుత్వం చెక్ పవర్‌ను రద్దు చేయడంతో పంచాయతీ అభివృద్ధి కుంటుపడింది.

కంపుగొడుతున్న గ్రామం

సర్పంచ్ చెక్ పవర్ రద్దుతో పంచాయతీ అభివృద్ధి మండల పరిషత్ అభివృద్ధి అధికారి చేతికి వెళ్లింది. గత మూడు నెలలుగా పంచాయతీలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో కాలువలు పూర్తిగా మురికితో నిండి రోడ్డుపై పారుతోంది. గ్రామానికి ఇరువైపులా చెత్తా, చెదారం నిల్వ కావడంతో గ్రామం కంపుగొడుతుందని, రాత్రి సమయాల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రోడ్డుపై పారుతున్న మురుగునీరు


పాఠశాలలకు వెళ్లే రహదారిలో చెత్త

తాగునీటికి కటకట

మండపల్లి పంచాయతీలో ఉన్న మంచినీటి బోర్లు పాడైపోవడంతో ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నారు. వర్షం ఎప్పుడు కురుస్తుందా.. నిత్యవసరాల కోసం వర్షపు నీటిని పట్టుకుంటామన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. ఉదయం సమయంలో జల్ జీవన్ మిషన్ ద్వారా వస్తున్న తాగునీరు పట్టుమని పది నిమిషాలు కూడా రావడం లేదని, దీంతో పశువుల దాహార్తి కూడా తీర్చలేకపోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో విష సర్పాలు, జంతువులు సంచరిస్తున్నాయని వాపోతున్నారు.


మరమ్మతుకు గురైన మంచినీటి బోరు

రూ.35 లక్షలు ఏమయ్యాయి..?

సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు పంచాయతీకి సంబంధించి స్థానిక ఎంపీడీవో, ఈఓపీఆర్డీ కలిసి రూ.35 లక్షలు విత్‌డ్రా చేశారు. అయితే వాటితో పంచాయతీలో ఎటువంటి అభివృద్ధి చేశారో తనకు నివేదిక అందజేయాలని స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఇటీవల జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కవిటి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమీక్ష సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి కె.భారతీ సౌజన్యను నిలదీయడం చర్చనీయాంశంగా మారింది.


గ్రామ సచివాలయం ముందు మురుగునీరు

చెక్ పవర్ పునరుద్ధరణ

సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేయడంతో సర్పంచ్ పిట్ట శేషమ్మ కోర్టుకు వెళ్లిన నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు చెక్ పవర్ పునరుద్ధరిస్తూ సెప్టెంబర్ 25వ తేదీన డీపీఆర్వో భారతీ సౌజన్య ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ మండల పరిషత్ నుంచి పూర్తిస్థాయిలో సర్పంచ్‌కు అధికారాలు ఇవ్వకపోవడంతో పంచాయతీ అభివృద్ధి నిలిచిపోయింది.

అభివృద్ధికి ఆదేశాలు ఇవ్వడం లేదు



నేను ఎటువంటి నిధులు దుర్వినియోగం చేయకపోవడంతో కోర్టుకు వెళ్లి నిజాయితీ నిరూపించుకున్నాను. కోర్టు చెక్ పవర్‌ను పునరుద్ధరించినప్పటికీ నాకు పంచాయతీ అభివృద్ధి చేసేందుకు అధికారులు ఎటువంటి ఆదేశాలు ఇంతవరకు ఇవ్వలేదు. పంచాయతీకి సంబంధించిన రికార్డులు ఇంకా మండల పరిషత్‌లోనే ఉన్నాయి. నాకు పూర్తిస్థాయిలో ఆదేశాలు వచ్చిన వెంటనే పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలపై దృష్టి సారిస్తాను.

– పిట్ట శేషమ్మ, సర్పంచ్, మండపల్లి

పారిశుద్ధ్య పనులు చేస్తాం

మండపల్లిలో పారిశుద్ధ్యం బాగోలేదని, విద్యుత్ బల్బులు వెలగడం లేదని, మంచినీటి బోర్లు పాడైపోయాయంటూ గ్రామస్తులు ఇటీవల ఫిర్యాదు చేశారు. త్వరలోనే పంచాయతీలో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాను. సర్పంచ్‌కు సంబంధించి ఇటీవల చెక్ పవర్‌ను పునరుద్ధరించడం జరిగింది కానీ.. ఆమెకు ఇంకా పంచాయతీలో పనులు చేసేందుకు అనుమతులు ఇవ్వలేదు. గత ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈఓపీఆర్డీలు పంచాయతీకి సంబంధించి రూ.35 లక్షలు విత్ డ్రా చేసినట్లు సమావేశంలో ఎమ్మెల్యే ప్రస్తావించినప్పటికీ, నేను ఇటీవల బాధ్యతలు తీసుకోవడంతో దీనిపై అవగాహన లేదు.

– ఎ.ప్రభాకరరావు, ఎంపీడీవో, ఇచ్ఛాపురం మండలం

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


వజ్రపుకొత్తూరు రూరల్: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని బి.హారిక, 8వ తరగతి విద్యార్థి ఎస్.రాజ్‌కమల్‌లు అండర్– 14 కబడ్డీ పోటీలకు ఎంపిక కాగా.. 10వ తరగతి విద్యార్థి బి.కుమారస్వామి లాంగ్‌జంప్ పోటీలకు, బి.కిరణ్ జావెలిన్ త్రో పోటీలకు ఎంపికయ్యారు. దీంతో వీరిని పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ బి.లక్ష్మీపతి, హెచ్‌ఎం టి.హేమారావు, పీడీ పి.గజేంద్ర, జె.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


టెక్కలి: విద్యార్థులను అభినందిస్తున్న ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్ తదితరులు

టెక్కలి: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు మండలంలోని పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. యోగా, తైక్వాండో, రగ్బీ, నెట్‌బాల్, షూటింగ్ బాల్, రోప్ స్కిప్పింగ్, సాఫ్ట్ టెన్నీస్ తదితర క్రీడలకు ప్రదీప్, రాధిక, నిఖిల్, జీవనజ్యోతి, గ్రీష్మ, అస్మిత, భువనేశ్వర్, జ్ఞానేశ్వరి, దుర్గాప్రసాద్, ఉదయ్‌కిరణ్, వరుణ్‌కుమార్, వాసుదేవరావు, నీలిమ, వాణి తదితర విద్యార్థులు ఎంపికయ్యారు. దీంతో వీరిని పాఠశాల ఆవరణలో ఉప విద్యాశాఖాధికారి పి.విలియమ్స్, పీడీలు ఆదిశేషు, జగదీశ్వరరావు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

పాఠశాలలో ప్రయోగశాల ప్రారంభం

సంతబొమ్మాళి: మండలంలోని వల్లేవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి, అమెరికాలో స్థిరపడిన కోరాడ రవీంద్ర తన తల్లి సుశీలమ్మ జ్ఞాపకార్థం సైన్స్ ప్రయోగశాలను పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ ప్రయోగశాలను మండల విద్యాధికారులు చిన్నవాడు, అర్జునుడు చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని దానాల్లోకి విద్యాదానం గొప్పదన్నారు. పాఠశాలకు రవీంద్ర సేవలు కొనియాడారు. అనంతరం రవీంద్ర కుటుంబ సభ్యులు కోరాడ సుమిత్రమ్మ, తర్లాన నారాయణమూర్తి, కోరాడ రాంప్రసాద్‌లను మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.


పాఠశాలలో ప్రయోగశాలను ప్రారంభిస్తున్న ఎంఈవోలు

కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారావు, విద్యా కమిటీ చైర్మన్ ఇప్పిలి అప్పన్న, మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రెడ్డి సూరిబాబు, గేదెల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థులు ఎంపిక

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎంబీఏ విద్యార్థులు గ్లోలాజిక్స్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాదికి రూ.5.2 లక్షల వేతనానికి 10 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. వీరిని పలువురు అభినందించారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కేదారిపురం గ్రామ శివాలయం మండపం వద్ద బుధవారం రాత్రి 12 గంటల సమయంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది వ్యక్తులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. దీనిలో భాగంగా రూ.51 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. మున్సిపాలిటీ పురుషోత్తపురానికి చెందిన దనపాన దుర్యోధన, దనపాన చిన్న, కేదారిపురం గ్రామానికి చెందిన జామి దానయ్య, తర సందీప్, నీలాపు యర్రయ్య, పిట్ట దేవదాసు, అనపాన జనార్దనరెడ్డి, నీలాపు సుధాకర్‌లపై కేసు నమోదు చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి


మాట్లాడుతున్న సీఐ సూర్యనారాయణ

పలాస: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ సూచించారు. మండలంలోని రంగోయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ చట్టాలపై గురువారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన అవసరమన్నారు. సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉప్పాడ రమేష్‌పాల్గొన్నారు.

చర్చ లేకుండా ముగిసిన సర్వసభ్య సమావేశం

వజ్రపుకొత్తూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం చర్చ, అజెండా లేకుండానే ముగిసింది. వైస్ ఎంపీపీ వంక రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 21 మంది సభ్యులున్న మండల పరిషత్‌లో ఏడుగురు సభ్యులు మాత్రమే హాజరు కావడంతో సమస్యలపై చర్చ జరగలేదు. దీంతో వచ్చే సమావేశానికి పూర్తిస్థాయిలో సభ్యులు హాజరు కావాలని ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు కోరారు.

జంగిల్ క్లియరెన్స్

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బెండి – మంచినీళ్లపేట ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న తీరుపై ఈనెల 8వ తేదీన సాక్షి పత్రికలో 'జంగిల్ క్లియరెన్స్ చేపట్టండి' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం అర్‌అండ్‌బీ ఏఈ జగదీష్ పర్యవేక్షణలో యంత్రాల సాయంతో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. మరో వారం రోజుల్లో పూర్తిస్థాయిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి యాప్‌ల బహిష్కరణ

- ఫ్యాప్టో నేతల ప్రకటన
- ఎంఈవోలకు వినతిపత్రాలు అందజేత

వజ్రపుకొత్తూరు రూరల్: ఉపాధ్యాయుల సమస్యలపై ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు చేస్తున్న పోరాటాలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈనెల 10వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల నిర్వహణ కోసం అమలు చేస్తున్న యాప్‌లను బహిష్కరించనున్నట్లు ఉపాధ్యాయ సంఘ నాయకులు తెలిపారు. ఈ మేరకు వజ్రపుకొత్తూరులో గురువారం ఎంఈవో వెంకట రమణకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు కె.జయరాం, గున్న సుభాష్, కుసుమూరు వెంకటరావు, జి.ఢిల్లేశ్వరరావు, కె.తిరుమలరావు, విశ్వనాథం, చంద్రశేఖర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: ఉపాధ్యాయులకు భారం కలిగించే వివిధ రకాల యాప్‌లను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘం సభ్యులు తెలియజేశారు. ఈ మేరకు టెక్కలి మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేస్తూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల భోజనాలకు సంబంధించిన ఫొటోలు మాత్రమే యాప్‌లో అప్‌లోడ్ చేస్తామని, మిగిలిన యాప్‌లను బహిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు వి.ఆదినారాయణ, జి.శ్రీనివాసరావు, టి.బాబురావు, కె.దాలయ్య, టి.వైకుంఠరావు, పి.గణపతిరావు, ఎం.కుమారస్వామి, చక్రవర్తి, లక్ష్మణ రాజా తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: ఈనెల 10వ తేదీ నుంచి ఉపాధ్యాయులంతా బోధనేతర పనులు బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఎంఈవో జి.నర్సింహులకు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్.చిరంజీవి, బాలక శంకరరావు, చిలుకు కృష్ణారావు పాల్గొన్నారు.

కవిటి: రాష్ట్ర ఫ్యాప్టో సంఘం సూచనల మేరకు శుక్రవారం నుంచి అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో బోధనేతర యాప్స్ పనుల్ని బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో కవిటి మండల శాఖ నేతలు తెలిపారు. ఈ మేరకు ఎంఈవో ధనంజయ మజ్జికి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.


కవిటి: ఎంఈవో ధనంజయకి వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నేతలు


నందిగాం: ఎంఈవో నర్సింహులకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో సభ్యులు


వజ్రపుకొత్తూరు రూరల్: ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

సారూ... పట్టించుకోరూ..!

- రోడ్లకిరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు
- ప్రమాదాలు జరుగుతున్న వైనం
- జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని వేడుకోలు


మాకన్నపల్లి రోడ్డు మలుపు వద్ద జంగిల్ క్లియరెన్స్ చేపట్టని దృశ్యం

పలాస:

పలాస నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. ఫలితంగా రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నారు. దీనికి తోడు రోడ్లను మరమ్మతులు చేయకపోవడంతో ప్రమాదాలు మరింతగా పెరుగుతున్నాయి. కాశీబుగ్గ నుంచి రంగోయి వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు అత్యంత దారుణంగా ఉంది. ముఖ్యంగా కాశీబుగ్గ నుంచి గరుడభద్ర వరకు రోడ్డుపై రాళ్లుతేలి, అక్కడక్కడ గంతలు ఏర్పడి ఉన్నాయి. దీంతో వర్షంపడితే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

ఇకపోతే గరుడభద్ర కూడలి నుంచి మర్రిపాడు, బొడ్డపాడు మీదుగా రంగోయి వరకు సుమారు 10 గ్రామాలు ఉన్నాయి. ఈ రోడ్డులో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న బస్సులు, ఇతర వాహనాలు తప్పించలేక ప్రమాదాలబారిన పడుతున్నారు. అదేవిధంగా అక్కుపల్లి – గుణుపల్లి రోడ్డు, అక్కుపల్లి – వజ్రపుకొత్తూరు రోడ్డు, గరుడఖండి – బ్రాహ్మణతర్లా రోడ్డులో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. లొద్దభద్ర కూడలి నుంచి కొశారింగ్ తాళభద్ర వరకు రోడ్డు మరీ ఘోరంగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని కోరుతున్నారు.

ఆటోలు నడపలేకపోతున్నాం



రోడ్లపై గుంతలతో పాటు మలుపులు వద్ద ఇరువైపులా పిచ్చిమొక్కలు విపరీతంగా ఉన్నాయి. దీనివలన ఆటోలు నడపలేకపోతున్నాము. బస్సు వచ్చినప్పుడు చాలా ఇబ్బంది పడుతున్నాము. రాత్రిపూట మరీ కష్టంగా ఉంది. రోడ్డు మరమ్మతులు చేపట్టాలి. అలాగే జంగిల్ క్లియరెన్సు చేపట్టాలి.

– వంకల అప్పారావు, ఆటో డ్రైవర్, బొడ్డపాడు కాలనీ, పలాస

జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి



రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి. రోడ్డుపైకి పిచ్చిమొక్కలు రావడంతో చాలా ఇబ్బందిగా ఉంది. రంగోయి, గురుదాసుపురం తదితర గ్రామాల వద్ద జీడి చెట్లు రోడ్డుపైకి వచ్చి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అలాగే మలుపులు కూడా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– కుత్తుం వినోద్, సామాజిక కార్యకర్త, మాకన్నపల్లి


బొడ్డపాడు వద్ద రోడ్డు మలుపు వద్ద పరిస్థితి...

దాతల సహకారం అభినందనీయం

సోంపేట: పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎర్రముక్కాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనంత అన్నారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి సోమేశ్వరరావు పాఠశాలకు బీరువాను వితరణగా గురువారం అందజేశారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు సోమేశ్వరరావును అభినందించారు.


వజ్రపుకొత్తూరు: మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్‌నాయుడు


ఇచ్ఛాపురం రూరల్: మాట్లాడుతున్న ఎంపీపీ బోర పుష్ప


కంచిలి: మాట్లాడుతున్న ఎంపీడీవో తిరుమలరావు


కవిటి: మాట్లాడుతున్న ఎంపీడీవో త్రినాథ

ఆదాయ వనరులు పెంచుకోవాలి

పంచాయతీల్లో ఆదాయ వనరులు పెంచుకోవాలని ఎంపీడీవోలు సూచించారు. అన్ని మండలాల్లోని మండల పరిషత్ సమావేశ మందిరాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పంచాయతీల్లో వారపు సంతలు, రోజువారీ మార్కెట్లు, ఆశీల వసూళ్లతో పాటు ఇంటి పన్ను, వ్యవసాయ పన్ను తదితర ఆదాయ వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్